# నెమలికన్ను పై నెత్తుటి చుక్కలు

ఆ రోజు స్కూల్‌కి సెలవు ప్రకటించారు.

స్కూల్‌కి ఓ పెద్దాయనని ఎన్నుకుంటారట అని తెలిసి పిల్లల్లోనూ ఏదో ఉత్సుకత... ఊరంతా ఎన్నికల కోలాహలం... సర్పంచి ఎన్నికల లెవల్లో అంతకు ముందురోజు రాత్రి... మందు పార్టీలయ్యాయి... మంతనాలు జరిగాయి.

నాలుగో తరగతి చదువుతున్న వికాస్‌కి వాళ్ల నాన్న స్కూల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు అర్థమైంది. బార్యాభర్తల గొడవని బట్టి... రాత్రి సదాశివ్ ఇంట్లో అయిదువేలు తీసికెళ్తుంటే భార్య రాధవ్వ అడ్డుపడింది.

"అయిదువేలు ఖర్చుపెట్టి పోటీలో నిలబడకపోతేంది? ఆ అయిదు వేలు సంధ్య రేపోమాపో పెద్దమనిషి అవుతే అవసరమని బీడీలు చేసి దాచిపెట్టుకున్నా... ఆ స్కూలు మీద సంపాదించేదేముంది? సార్లకే జీతాలు తప్ప ఏం దొరుకయ్? నువ్వు చైర్మెన్ అయితే నీకేం దొరుకతయ్... పేరు పెద్దరికం తప్ప... ఆ అయిదువేలు ఇటియ్యి' అంది.

సదాశివ్‌కు భార్య మాటల్లోని కోపమచ్చింది. అప్పటికే కొంచెం తాగి వున్నాడు. "వూరంతా నన్ను పోటీ చెయ్యమంటుండ్రే... మా పార్టీ కార్యకర్తల్లో గవర్నమెంటు స్కూల్లో చదివేది మన కొడుకు ఒక్కడే వున్నడు. పోటీలో నేను తప్ప ఎవ్వలు నిల్చోరాదు..." కోపంగా అన్నాడు.

"అయితే నిల్చో... కాని ఆ అయిదువేలు అక్కడ పెట్టివెళ్లు. ఆ డబ్బేదో మీ పార్టీ వోళ్లను ఇమ్మను..." అంది రాధవ్వ.

"ఇప్పటికే అవతలి పార్టీవోడు ఇరవై వేలు ఖర్చుపెట్టిండే.. నేను కొంతయినా ఖర్చుపెట్టకపోతే ఎట్ల గెలుస్తా? రేపే ఎలక్షను... ఈ రాత్రి తాగించకపోతే రేపు ఎవడూ ఓటెయ్యడు అడ్డులే..." అన్నాడు మరింత కోపంతోని.

"నువ్వు గెలిచి రాజ్యాలు ఏలాల్సిందేమి లేదు. మన ముదనష్టపు సంపాదనకి అదొక్కటే తక్కువైంది. ముందు అయిదు వేలివ్వు... అంది మీదపడి గుంజుకుంట.

"ఏందే బాగా మాట్లాడుతున్నావ్... మొగుడ్ననే గౌరవం లేకుండా పోతుందే నీకు? మర్యాదగా పక్కకి జరుగు..." అన్నాడు డబ్బుని గట్టిగా పట్టుకొని. రాధవ్వ సదాశివ్ చేతుల్లోని డబ్బుని లాక్కోవడానికి అరుస్తూనే ప్రయత్నాలు చేస్తోంది.

"ఏ పెండ్లానికైనా పైస సంపాయించే మొగుని మీద గౌరవముంటది... ఖర్చు పెట్టోటోడి మీద కాదు. అవి నేను దాచిపెట్టు కున్న రూపాయలు.. చిరిగిపోతాయ్... మర్యాదగా ఇచ్చేయ్.." అని లాక్కోబోయింది. సదాశివ్ ఉగ్రుడైపోయిండు.

"దొంగముండా... పక్కకి జరుగు" అంటు బలంగా తోసేసిండు. రాధ విసురుగా వెళ్లి గోడకి తాకింది. నుదురు బొప్పి కట్టింది. రాధ బిగ్గరగా ఏడుస్తుంటే సదాశివ్ వడివడిగా వెళ్లిపోయిండు.

ఈ దృశ్యం చూస్తోన్న ఎనిమిదేల్ల వికాస్‌కి... పన్నెండేళ్ల సంధ్యకి భయమేసింది. తల్లిని ఓదార్చడానికి దగ్గరగా వెళ్లి మౌనంగా నిల్చున్నారు.

రాధవ్వ ఏడుస్తూనే వుంది.

xxx xxx xxx

స్కూల్ ఎలక్షన్ రోజు సెలవైనా... పిల్లలంతా దూరంగా... గ్రౌండ్‌లో నిల్చొని చూస్తున్నారు. స్కూలంతా హడావిడి... గోలగోల... వికాస్ పక్కనే వచ్చి జలందర్ నిల్చున్నాడు. వికాస్ నాన్నకు పోటీగా... జలందర్ వాళ్ల నాన్న శంకరయ్య పోటీ చేస్తున్నాడు. వాళ్లిద్దరూ క్లాసులో మంచి దోస్తులయినా... వికాస్ నవ్వినా జలంధర్ నవ్వలేదు. యూనిట్ పరీక్షల్లో వికాస్‌కే ఫస్టు మార్కులొస్తాయన్న కోపంతో పాటు... మా నాన్నపై మీ నాన్న పోటీ చేస్తాడ్రా అన్నంత కసి జలంధర్‌లో కన్పడింది.

పిల్లల్లో కూడా గ్రూపులేర్పడ్డాయి. కొందరు వికాస్ దగ్గరికొచ్చి నిలబడితే... మరికొందరు జలందర్ దగ్గర నిల్చున్నారు.

అప్పటికే ఓటింగ్‌లో ఏం జరిగిందో కాని... ఒక్కసారిగా గొడవ మొదలైంది. అరుపులు... కేకల్తోపాటు కొట్టుకోవటం మొదలైంది. దూరంగా నిల్చొని చూస్తున్న విద్యార్థుల కళ్లల్లో భయం తొణికిసలాడింది.

అప్పటికే గొడవ పెద్దదయింది.

కర్రలతో కొట్టుకోవటం... రాళ్లు విసురుకోవటం మొదలెట్టారు. పిల్లలు భయంతో చెల్లాచెదురై పారిపోయారు. ఎలక్షన్ ఆఫీసర్, టీచర్లు పరుగున వెళ్లి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసారు.

శంకరయ్య గ్రూప్‌కు చెందిన ఓ వ్యక్తిని సదాశివ్ గ్రూప్ వ్యక్తులు స్కూల్ ఆవరణలోనే పొడిచారు.

ఆ ఆర్తనాదం... వూరంతా విన్పించింది. పాత పగలు పొడుచుకొచ్చినయ్... పార్టీ ఆదిపత్యాలు గుర్తొచ్చినయి. క్షణాల్లో వూరంతా రెండు వర్గాలుగా విడిపోయింది.

మారణహోమం జరిగేదే... వూర్లోకి పోలీసులు అడుగుపెట్టారన్న వార్త... ఎక్కడి వాళ్లక్కడ భయంగా జారుకున్నారు. ఎలక్షన్ రేపటికి వాయిదా పడింది... అని వూరంతా చాటింపు వేయించారు.

ఆ రాత్రి మళ్లీ నిశ్శబ్దంగా... మంతనాలు... మందుపార్టీలు జరిగాయి.

మర్నాడు...

ఓటింగ్‌కి స్కూల్లో అంతా సిద్ధమయ్యారు. పదిమంది దాక

పోలీసులుండటంతో అంతా నిశ్శబ్దంగా వున్నారు. కాని మనసుల నిండా ఉక్రోశం రగిలిపోతంది. ఇదంతా టీచర్లకి ఓ తలనొప్పిలా తయారైంది. ఓట్లు సమానంగా వచ్చే సూచనలు కన్పడటంతో... పెద్ద మనుషులంతా కల్సి ఓ తీర్మాణం చేసారు. 'వూరి కోసం ఎవరు యాభైవేలు ఇస్తే వారే విద్యా కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైనట్లు లెక్క' అని.

ఆ మాటకు శంకరయ్య వెంటనే ఒప్పుకున్నాడు. ఈ మధ్యే మస్కట్ నించి వచ్చి ఏదో అధికారం కోసం ఆరాటపడుతున్న శంకరయ్య డబ్బు పోయినా పర్లేదు... ఈ పదవి దక్కాల్సిందే అనే పట్టుదలతో ఒప్పుకున్నాడు.

ఆ ప్రతిపాదనతో సదాశివ్ ఖంగుతిన్నాడు. వూరంతా దానికి ఒప్పుకోవటంతో సదాశివ్ ఏమీ చేయలేక అవమానంతో బయటికెళ్లిపోయాడు.

xxx xxx xxx

పది రోజులు గడిచాయి.

బస్సు దిగి స్కూలుకొస్తున్న ముగ్గురు టీచర్లకి రోడ్డు మీద వికాస్ ఎదురయ్యాడు. పది రోజులుగా వికాస్ స్కూల్‌కి రావటం లేదని గ్రహించిన హెడ్మాస్టర్ భాస్కర్ సార్ వికాస్‌ని పిలిచి...

"వికాస్... బడికి రావట్లేదెందుకూ?" అనడిగాడు ప్రేమగా.

"మా నాన్న బడికి వెళ్లొద్దన్నాడు" అన్నాడు వాడు భయంగా.

"అదే ఎందుకు?" అంది పద్మజ టీచర్.

"నేను ఓడిపోయిన స్కూల్లో నువ్వు చదువుడేందిరా అంటున్నాడు.

ప్రయివేట్ స్కూల్‌కి పంపించడానికి అమ్మ పైసల్లేవంటుంది" అన్నాడు వాడు ఏడ్పు మొకంతో.

ఆ మాటతో ముగ్గురు టీచర్లలోనూ ఏదో బాధ...

"నాకు బడికి రావాలనుంది సార్..." అన్నాడు వాడు మళ్లీ. వాడి చిన్నారి కళ్లల్లో నీళ్లు.

"ఈ రోజు నించే నువ్వు స్కూల్‌కిరా... మేమంతా మీ నాన్నతో మాట్లాడుతాం" అన్నాడు రమేష్ సార్. అటుగా వెళ్తున్న సదాశివ్‌ని పిలిచాడు భాస్కర్.

"మీ రాజకీయాలతో పిల్లలకేం పని? వికాస్‌ని బడికెందుకు పంపించ ట్లేదు" అని అడిగారు ముగ్గురూ.

సదాశివ్ ఏమీ మాట్లాడకుండా "ఈరోజు నించే పంపిస్తాసార్" అని మొహం చాటేసుకొని వెళ్లిపోయాడు. టీచర్లంతా సదాశివ్‌తో మాట్లాడటం హోటల్ గుడిసెలోంచి చైర్మెన్ శంకరయ్య చూసాడు. కొంచెం సిరియస్‌గానే లేచి వచ్చాడు.

"ఏం సార్లు... పది నిమిషాలు లేటయింది. మీరు బడికి ఎప్పుడు పోతరు? చదువెప్పుడు చెప్తరు?" అన్నాడు.

ముగ్గురు టీచర్లు మౌనంగానే అక్కన్నించి కదిలారు.

"వేలకువేలు జీతాలు తీసుకుంటరు... చదువు చెప్పుడు చేతకాదు" వెనకనించి చైర్మన్ శంకరయ్య ఏదేదో అంటూనే వున్నాడు.

"పది నిమిషాలు లేటైతే పిల్లలంతా ఐఏఎస్, ఐపియస్‌లు మిస్సయి తున్నట్టు మాట్లాడుతుండు. కరెక్ట్ టైము కొచ్చి క్లాసరూంలో నలభై నిమిషాలు

ఛూఛూ మంత్రంలా కాలం గడిపితే ఏం పీక్కుంటాడు వీడు... దేశంలో జరిగే కుంభకోణాల్తో పోలిస్తే అయిదు నిమిషాలు ఆలస్యం కావటం ఎంత? ప్రతి ఒక్కడికీ టీచర్ల మీదే కన్ను... మనకన్నా తక్కువ జీతమున్న కానిస్టేబుల్ వైపు కన్నెత్తి చూడ్డానికైనా భయపడ్తారు... నీయమ్మ వ్యవస్థ..." కొంచెం దూరం పోయాక కసిగా అన్నాడు రమేష్ సార్.

"వీడెప్పుడు స్కూలుకొచ్చినా లుంగీ మీదే వస్తాడు సార్... వాడికి స్కూలంటే అంత గౌరవం... వాడితో పాటు మరో నలుగురు లుంగీల మీద... లేడీ టీచర్స్ వున్నారన్న ఇంగిత జ్ఞానమైనా వుండదు" అంది పద్మజ టీచర్ కోపంగా.

"స్కూలు పాస్‌బుక్కులో ప్రభుత్వం తరగతి గదుల రిపేర్లకోసం పంపిన ఇరవైవేలున్నయి కదా... ఏదో రిపేరు అని డ్రా చేద్దామంటున్నాడు. నాకేమో భయంగా వుంది" అన్నాడు హెచ్.ఎం. భాస్కర్.

"మీరు రిస్క్ తీసుకోకండి సార్... డబ్బు విషయం... ఇరవై వేలతో ఏం పనిచేస్తారా అని ఎగస్పార్టీ వాళ్లు చూస్తున్నారు" అన్నాడు రమేష్ సార్. అంతలోనే అటెండర్ ఎదురొచ్చి కొన్ని కాగితాలు హెచ్.ఎం. భాస్కర్ చేతికిస్తూ...

"ఎం.ఇ.ఓ. పంపించాడు సార్. అర్జంటుగా ఈ రిపోర్టులన్నీ ఈరోజే రాసి పంపించమన్నారు" అన్నాడు.

ఆ మాట విని పద్మజ టీచర్ నిట్టూర్చింది. రోజూ ఏదో ఒకటి రాయటమే అవుతుందని! "మీటింగ్‌లని, ట్రయినింగ్‌లని, రిపోర్ట్‌లని, సర్వేలని, జనాభా లెక్కలని, ఎలక్షన్ డ్యూటీలని, పల్స్ పోలియోలని, ర్యాలీలని, ఇలా మనల్ని తరగతి గదిలోంచి బయటికి తరుముతున్నారు. విద్యార్థులతో మమేకమై... మనస్ఫూర్తిగా

పాఠం చెప్పక ఎన్నాళ్లయింది సార్" రమేష్ సార్ బాధగా అన్నాడు. స్కూల్ ఆవరణలో ప్రవేశిస్తూ...

అప్పటికే అవరణంతా పొగ నిండి వుంది.

మధ్యాహ్న భోజనం వండే నర్సమ్మ పచ్చి కట్టెలతో పొయ్యిని రాజేస్తూ వుంది. టీచర్లని చూసి దగ్గరికొచ్చి "చైర్మన్ సాబ్ చెప్పిండు సారూ... అన్నం తినే పోరగాండ్ల సంఖ్యనే కాదు... బడికొచ్చిన మొత్తం పోరగాండ్లు అన్నం తింటున్నటే రాసియ్యుమన్నడు. చైర్మన్ మావోడే..." అంది.

చూద్దాం అన్నట్టు తలూపి... స్టాఫ్ రూంలోకి నడిచారు.

xxx xxx xxx

అటెండెన్స్ తీసుకొచ్చిన తర్వాత... అర్జంటుగా పంపాల్సిన రిపోర్ట్‌లని రాయడానికి ముందేసుకొని కూచున్నాడు. ఇంతలో ఓ కుర్రాడు పరిగెత్తుకొచ్చి... "సార్... వికాస్‌గాడు, జలంధర్‌గాడు కొట్టుకుంటున్నారు" అని చెప్పాడు.

"రమేష్... ఓసారి క్లాస్‌లోకి వెళ్లిరా" చెప్పాడు హెచ్.ఎం. భాస్కర్.

రమేష్‌సార్ వెళ్లేసరికి... వికాస్, విద్యాకమిటీ చైర్మన్ కొడుకు జలంధర్ పొట్లాడుకుంటున్నారు. క్లాసంతా గొలగోలగా వుంది. రమేష్‌సార్ ఇద్దర్ని విడిపించి చేరోటి అంటించాడు.

"వీడు నా నెమలి కన్ను పుస్తకంలోంచి దొంగిలించాడు సార్" రొప్పుతూ చెప్పాడు వికాస్. పిల్లలంతా అదే మాట చెప్పారు. బెంచీ తాకటంతో జలందర్ ముక్కులోంచి రక్తం కారుతోంది. వాడి చేతిలోని నెమలి ఈకపై రక్తం బొట్టుబొట్లు

గా పడి జారిపోతోంది., వాడు కసిగా నెమలి ఈకని నలిపేసి కింద పడేసాడు.

"ఎందుకు దొంగిలించావురా..." కోపంగా అడిగాడు రమేష్ సార్.

"మా నాన్నతో చెప్తా..." ఆవేశం బుసలు కొడుతుంటే సార్ వైపు గుర్రుగా చూస్తూ అన్నాడు వాడు.

"ఏంట్రా చెప్పేది..." ఈడ్చికొట్టాడు రమేష్ సార్. ఆ దెబ్బకు పిల్లలంతా ఎక్కడివాళ్ళక్కడ కూచొని నిశ్శబ్దంగా పుస్తకాలు తీసి తలదూర్చారు.

"దొంగతనం చేస్తే కొట్టడమేనా? మాకు చెప్పొద్దా?" అని వికాస్‌ని కూడా రెండు దెబ్బలు కొట్టాడు. అది చూసి జలందర్ మొహంలో తృప్తి కనవడింది.

నిజానికి వాళ్లిద్దరి మనసుల్లో రగులుతున్నదేంటో రమేష్‌కి అర్థమైంది. క్లాసంతా నిశ్శబ్దమైంది.

చివరి బేంచీలో బెరుకుబెరుగ్గా కూచున్న ఓ కొత్త కుర్రాడు కన్పించాడు. రమేష్‌సార్ పిలువగానే భయంభయంగా వచ్చాడు

"కొత్తగా జాయినయ్యావా?"

"అవున్సార్" చేతులు కట్టుకొని చెప్పాడు.

"ఎక్కన్నించి వచ్చావ్"?

"చిల్కాకోడూర్ నుంచి"

పిల్లలందరూ పుస్తకాల్లోంచి తలలు పైకెత్తి చూస్తున్నారు.

"ఇక్కడే చదువుకుంటావా?"

"అవున్సార్.. ఇది మా అమ్మమ్మ వాళ్లవూరు... అమ్మతో వచ్చాను... ఎప్పటికీ ఇక్కడే చదువుకుంటాను"

బాగా భయపడ్తున్న కుర్రాణ్ణి దగ్గరగా తీసుకున్నాడు రమేష్‌సార్.

"మీ నాన్నేం చేస్తాడు?"

"నాన్న చచ్చిపోయాడు... కాదు కాదు... చంపేసింట్రు."

ఆ వాక్యం తరగతి గదిలోని చిన్నారి గుండెల్ని కుదిపేసింది. నిమిషంపాటు నిశ్శబ్దం....

"చంపేసారా? ఎందుకు? ఎవరు??" కదిలిపోయిన రమేష్‌సార్ కళ్ళల్లో తడి కదలాడింది.

"మొన్న విద్యా కమిటీ ఎన్నికల్లో నిల్చున్నందుకు..." గొంతు పెగలక ఆ కుర్రాడి కన్నీళ్లు చెక్కిల్లపై జారిపడ్డాయి.

అవి చూసాక పిల్లలందరి కళ్లల్లోనూ కుండపోతగా నీళ్లు!!

*